సమస్యలతో సహవాసం

- అధ్వానంగా రోడ్లు
- వెలగని వీధి లైట్లు
- మూలకు చేరిన పార్కులు
- సాగర్‌నగర్ వాసుల ఇక్కట్లు


వీధిలైట్లు వెలగకపోవడంతో అలముకున్న అంధకారం


శిథిలావస్థకు చేరుకున్న పార్కు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారు. సమస్యలపై సంబంధిత ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం దొరకటం లేదంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ చూసినా శిథిలమైన రోడ్లు, వెలగని వీధి లైట్లు, పగుళ్లిచ్చిన డ్రైనేజీలు, మూలకు చేరిన పబ్లిక్ పార్కులు దర్శనమిస్తున్నాయి.

గుడ్లవానిపాలెం పంచాయతీలో ఉండే ఈ కాలనీని 30 ఏళ్ల క్రితం వుడా సాగర్‌నగర్ పేరుతో ఏర్పాటు చేశారు. జీవీఎంసీలో విలీనమైన తరువాత సాగర్‌నగర్‌ను 8వ వార్డులో చేర్చారు. జీవీఎంసీ అయితే తమ ప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందుతుం
దని స్థానికులు కలలు
గన్నారు. కానీ ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. దీంతో అధికారుల చుట్టూ తిరగలేక స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎల్ఐజీ, ఎంఐజీ నివాసాల మధ్య డ్రైనేజీలు నిత్యం మురుగునీరుతో పొంగిపొర్లుతున్నాయి. ఈ గృహ సముదాయాల మధ్య ఉన్న సీసీ రోడ్లు పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయి. ఇక్కడి జీవీఎంసీ పార్కు నిర్వహణ లేక చెత్త చెదారాలతో పశువులకు ఆవాసంగా మారిపోయింది.


దయనీయ స్థితిలో రోడ్లు

వెలగని లైట్లు.. నిత్యం చోరీలు

ఈ ప్రాంతంలో వీధిలైట్లు వెలగడం లేదు. ఈ సమస్య నెలల తరబడి వేధిస్తోంది. ఇదే అదునుగా తీసుకున్న కొందరు ద్విచక్రవాహనాలను టార్గెట్ చేసుకుని రాత్రి సమయాల్లో పెట్రోల్ తీసేయడం, టైర్లను తొలగించడం నిత్య ప్రక్రియగా మారిపోయింది. నివాసాల ముందు వాహనాలను నిలపాలంటేనే భయమేస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణల జోరు

సాగర్‌నగర్‌లో ఇప్పటివరకు ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాగా, ఇప్పుడు రోడ్లు, డ్రైనేజీలను కూడా ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో ప్రధాన రహదారుల వద్దనే పార్క్ చేయడం వలన ట్రాఫిక్ సమస్య పెరిగిపోతోంది. అనధికారికంగా బడ్డీలు ఏర్పాటు చేసేస్తున్నారు. వీటిపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు ఫిర్యాదు చేసినా, చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతం సమీపంలోనే రెండు సచివాలయాలు ఉన్నా ఏ ఒక్క అధికారీ అందుబాటులో ఉండరు. దీంతో మధురవాడ జోనల్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేస్తున్నామని, అయినా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కాలనీపై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

రాత్రయితే భయం

నిత్యం చీకటిలోనే ఉండాల్సి వస్తోంది. రాత్రి సమయాల్లో వీధి దీపాలు వెలగక తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దొంగతనాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. దీంతో రాత్రయితే భయంగా ఉంటోంది.

– పి.శంకర్, సాగర్‌నగర్

నిర్వహణ గాలికి వదిలేశారు

సాగర్‌నగర్‌లో పాలన, నిర్వహణను అధికారులు, ప్రజా ప్రతినిధులు గాలికి వదిలేశారు. ఏ చిన్న సమస్యను కూడా అధికారులు పరిష్కరించడం లేదు. ఈ ప్రాంతమంతా ప్రస్తుతం సమస్యలతో ఉంది. వీటిని పరిష్కరించేందుకు అధికారులెందుకు రావడం లేదో అర్థం కావట్లేదు. లైట్లు లేక, రోడ్లు బాగోక, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోతే ఇక్కడివారు ఎలా జీవనం సాగిస్తారు. అధికారులు ఇప్పుడైనా స్పందించాలి. సమస్యలు పరిష్కరించాలి.

– గుడ్ల పోలిరెడ్డి, సాగర్‌నగర్

అనంతుని శిఖర ప్రతిష్టకు చిన్న శ్రీనుకు ఆహ్వానం


మజ్జి శ్రీనివాసరావుకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: పద్మనాభంలో గిరిపై ఈ నెల ఐదు నుంచి తొమ్మిదో తేదీ వరకు జరగనున్న అనంతుని శిఖర ప్రతిష్ఠ ఉత్సవాలకు భీమిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (మజ్జి శ్రీను)ను ఎంపీపీ కంటుబోతు రాంబాబు ఆహ్వానించారు. విజయనగరంలోని మజ్జి శ్రీనివాసరావు గృహానికి శుక్రవారం వెళ్లి, ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం పాల్గొన్నారు.

వైభవంగా రామానుజ జయంతి


పూజలందుకున్న రామానుజ స్వామి

కొమ్మాది: స్థానిక అన్నంరాజు నగర్‌లోని శ్రీ అష్టలక్ష్మీ దేవాలయంలో శుక్రవారం శ్రీ రామానుజ స్వామి 1008వ జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయంలో కొలువైన రామానుజస్వామికి ప్రత్యేక పూజలు చేసి, స్తోత్రాలతో పారాయణ చేశారు.

భక్తితో శంకర జయంతి

వైశాఖేశ్వరస్వామి ఆలయంలో శంకర జయంతి నిర్వహించారు. శంకరాచార్యులకు పంచామృతాభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు, ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి, చక్రధర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


దాతకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్ విక్రమ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మధురవాడకు చెందిన వేదనభట్ల రామ సత్యనారాయణ దంపతులు శుక్రవారం రూ.లక్ష 116 విరాళాన్ని అందజేశారు. సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. దాతకు ప్రోటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్, సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ బాండ్ అందించారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

మత్స్యకారులకు భృతి పంపిణీ

భీమునిపట్నం: భీమిలి ప్రాంతంలోని మత్స్యకారులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మత్స్యకార భృతి చెక్కులను పంపిణీ చేశారు. ఇక్కడి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారులను అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు వస్త్రాల వితరణ


పేదలకు వస్త్రాలు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

మధురవాడ: జీవీఎంసీ జోన్–2 పరిధిలోని శివశక్తినగర్, కొమ్మాది పరిసర ప్రాంతాల్లో గ్రేస్ హ్యాపీనెస్ చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు నిర్వహించింది. ట్రస్ట్ చైర్మన్ పోతల నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు, పిల్లల చదువు నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు. ఆయా ప్రాంతాల్లో సుమారు 150మంది పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేయగా, 30 మంది పిల్లలకు పుస్తకాల నిమిత్తం సాయం అందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పి.రత్నం, పి.సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగంగా మద్యం సేవిస్తే చర్యలు


మిథిలాపురి వుడా కాలనీ వద్ద కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ సునీత

మధురవాడ: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, ధూమపానం చేసినా చర్యలు తప్పవని పీఎం పాలెం ఎస్ఐ సునీత హెచ్చరించారు. మధురవాడ, మిథిలాపురి వుడా కాలనీ, సాయిరాం కాలనీ పరిసర ప్రాంతాలలో శుక్రవారం సాయంత్రం ఆమె ఆధ్వర్యంలో సిబ్బంది విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బహిరంగ మద్యపానం, ధూమపానం చేసిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, పెనాల్టీలు విధించారు. ముఖ్యంగా వైన్ షాపులను ఆనుకుని ఉన్న పాన్ షాపులు, ఇతర చోట్ల తనిఖీలు నిర్వహించారు. ఏఎస్ఐ రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శంకరాచార్య జయంతి

పీఎం పాలెం: స్థానిక శృంగేరీ శంకర మఠంలో జగద్గురు శంకరాచార్య జయంతిని శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మఠం గౌరవ ధర్మాధికారి జె.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో శంకరాచార్య విగ్రహానికి ఉదయం, సాయంత్రం అభిషేకాలు, అర్చనలు చేశారు. పుష్పాలతో శంకరాచార్యుని సుందరంగా అలంకరించారు. భక్తులు శంకరాచార్యులను దర్శించుకున్నారు.

పీఎం పాలెం ఎస్ఐగా రాము



మధురవాడ: పీఎం పాలెం లా అండ్ ఆర్డర్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా డి.రాము శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో యలమంచిలి, కె.కోటపాడు, త్రీ టౌన్ స్పెషల్ బ్రాంచ్‌లలో విధులు నిర్వర్తించి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

సీపీఐ మహాసభల పోస్టర్ విడుదల


పోస్టర్ విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

తగరపువలస: నగరంలోని కంచరపాలెంలో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ 25వ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. మహాసభల పోస్టర్‌ను స్థానిక గుజ్జు రామునాయుడు భవన్‌లో శుక్రవారం విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు కానూరు రాంబాబు, మోర అప్పలరాజు, కొండపు ఈశ్వరరావు, చిల్ల రాంపైడి, నూలు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలాలు స్వాధీనం

సాక్షి ఎఫెక్ట్..


ఆక్రమణలలో గోతులు పూడ్చి వేస్తున్న రెవెన్యూ సిబ్బంది

తగరపువలస: ఆనందపురం మండలం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చేరువలో జగనన్న కాలనీని ఆనుకుని సర్వే నంబర్ 355, 356లలో ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను రెవెన్యూ అధికారులు జేసీబీ సాయంతో తొలగించారు. 'సర్వే నం.355, 356లో ఆక్రమణలు' పేరుతో శుక్రవారం సాక్షిలో ప్రచురించిన వార్తకు ఆర్ఐ రీటా, వీఆర్వో అప్పారావు స్పందించారు. పాత ఖాళీ పట్టాల ఆధారంగా ఎక్కడపడితే అక్కడ ఖాళీ స్థలాలు ఆక్రమించి, నిర్మాణాలు చేపట్టి విక్రయాలు జరుగుతున్న సంఘటనలు ఇటీవల ఆనందపురంలో ఎక్కువగా జరుగుతున్నందున ఇలాంటి మోసగాళ్ల మాయలో పడవద్దని రెవెన్యూ అధికారులు హెచ్చరిస్తున్నారు.

ధ్యానం, ఆధ్యాత్మిక బోధపై రేపు సత్సంగం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 4వ వార్డు నేరెళ్లవలస సంపత్ వినాయకుని ఆలయం వద్ద కమ్యూనిటీ హాల్లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు 'ధ్యానం, ఆధ్యాత్మిక బోధ' అంశంపై సత్సంగం నిర్వహించనున్నారు. సీనియర్ పిరమిడ్ గ్రాండ్ మాస్టర్ గౌతంచే దీనిని నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ శిక్షణ సత్సంగానికి వచ్చేవారు పెన్ను, పుస్తకం తీసుకురావాలని సూచించారు. ఇందులో పాల్గొన్న వారికి మధ్యాహ్నం అన్నప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.వివరాలకు 8143810608, 9490702542 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విస్తృత తనిఖీలు

అల్లిపురం: సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు టూటౌన్ పోలీసులు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శుక్రవారం రాత్రి విస్తృత తనిఖీలు నిర్వహించారు. సీఐ ఎర్రంనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ కాంతారావు సిబ్బందితో కలిసి అనుమానిత లగేజీలు, ప్రయాణికులను తనిఖీ చేపట్టారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గల సీసీ కెమెరాలు పరిశీలించారు. ఆర్టీసీ లగేజీ కౌంటర్లు, బస్సుల్లో ఎగుమతి అవుతున్న పార్శిళ్లను పరిశీలించారు.

కిశోర బాలికలకు అవగాహన


కార్యక్రమంలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు శుక్రవారం వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. కిశోరి వికాసం పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో విద్య ప్రాముఖ్యత, సంపూర్ణ ఆరోగ్యం, రుతు పరిశుభ్రత, పోషకాహారం, పోక్సో, బాల్య వివాహాల నిరోధ చట్టం, ఆత్మరక్షణ, సైబర్ క్రైమ్, జీవనోపాధి తదితర అంశాల గురించి సచివాలయ పరిధిలోని ఆశ కార్యకర్త, అంగన్‌వాడీ, ఏఎన్ఎం, వీవో వివరించారు. ఈ నెల 2 నుంచి జూన్ 10 వరకు ప్రతి మంగళ, శుక్రవారాలలో 11 నుంచి 18 ఏళ్ల వయసు గల వారికి ప్రతి సచివాలయ పరిధిలో ఈ శిక్షణ కార్యక్రమం జరుగుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో భీమిలి ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీదేవి, సూపర్‌వైజర్ రత్నం తదితరులు పాల్గొన్నారు.

'భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలి'

తగరపువలస: ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీలో ల్యాండ్‌పూలింగ్ ద్వారా విలువైన భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించినట్టు ఎంపీపీ మజ్జి శారద ప్రియాంక, వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. పంచాయతీలో జాతీయ రహదారిని ఆనుకుని సర్వే నంబర్ 1లో 1080 ఎకరాల భూమి ఉందన్నారు. ప్రస్తుతం ఇందులో 200 ఎకరాలలో ఐటీ హబ్ నిర్మాణానికి ప్రతిపాదనలు జరుగుతున్నాయని తెలిపారు. దీంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందడమే కాకుండా 15వేల మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని పేర్కొన్నారు. ఇక్కడ భూములు కలిగిన దళిత, బీసీ రైతులకు సక్రమంగా సర్వే చేసి న్యాయం చేయాలని కోరారు. గత నెలలో పంచాయతీలో జరిగిన గ్రామసభలో కూడా ఆర్డీవో, తహసీల్దార్ల దృష్టికి రైతులు ఈ విషయాలు తీసుకువెళ్లారని పేర్కొన్నారు.

హోటల్స్ క్రికెట్ లీగ్ ప్రారంభం


పోటీలు ప్రారంభిస్తున్న హోటల్స్ సంఘం ప్రతినిధులు

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ సంఘం(హెచ్ఆర్ఏఏపీ) ఆధ్వర్యంలో మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం అంతర హోటల్స్ క్రికెట్ లీగ్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 16 హోటల్ జట్లు పాల్గొంటున్నాయి. హోటల్స్ సంఘం అధ్యక్షుడు ప్రశాంత్ తొలి మ్యాచ్‌ను ప్రారంభించారు. హోటల్ సిబ్బంది మధ్య స్నేహపూరిత వాతావరణాన్ని, క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే ఈ పోటీల ఉద్దేశమని సంఘం ఉపాధ్యక్షుడు పవన్ కార్తీక్ ఈ సందర్భంగా తెలిపారు. స్టార్ కేటగిరీ హోటల్స్ మేనేజర్లు, హెచ్ఆర్ మేనేజర్లు పాల్గొన్నారు. టోర్నీలో భాగంగా తొలిరోజు మూడు మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో ది పార్క్ హోటల్ జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచింది. మేఘాలయ హోటల్ నిర్దేశించిన 47 పరుగుల విజయ లక్ష్యాన్ని కేవలం 4.4ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. రెండో మ్యాచ్‌లో రాక్‌డేల్ హోటల్ జట్టు నిర్ణీత ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 104 పరుగులు చేసింది. ఐటీ ఫార్చ్యూన్ ఇన్ జట్టు తొమ్మిది వికెట్లు కోల్పోయి 91 పరుగులే చేసి ఓటమి పాలైంది. మూడో మ్యాచ్ ఏకపక్షంగా సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన పామ్ బీచ్ జట్టు కేవలం రెండు వికెట్లు కోల్పోయి 188 పరుగుల భారీ స్కోర్ సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయల్ ఫోర్ట్ హోటల్ జట్టు ఏడు వికెట్లు కోల్పోయి 47 పరుగులు మాత్రమే చేయగలిగింది.

'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలి

సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నేత వెంకటేశ్వర్లు


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల పార్టీలు నాయకులు

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కర్రెగుట్ట నిర్బంధాన్ని తక్షణమే విరమించి, మావోయిస్టుల ఏరివేత పేరుతో ప్రవేశపెట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ విశాఖ, విజయనగరం జిల్లాల ఏరియా కమిటీ నేత ఎం.వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. సీపీఐ(ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వివిధ ప్రజా సంఘాలు, పార్టీలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలను సమూలంగా నిర్మూలించి అటవీ సంపదను కార్పొరేట్లకు అప్పజెప్పే లక్ష్యంతో కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఈ దమనకాండకు పాల్పడుతోందని ఆరోపించారు. తక్షణమే ఈ నరమేధాన్ని ఆపి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు పైడిరాజు మాట్లాడుతూ రాజమండ్రి నుంచి రాయ్‌పూర్ వరకు ఎనిమిది లైన్ల రహదారులను అందంగా వేస్తున్నది ప్రజల కోసం కాదని, కార్పొరేట్ల కోసమే అన్నారు. అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ల సంతోషం కోసం అమాయక గిరిజనులందరినీ అణచివేసి, ఖనిజ సంపదను దోచిపెట్టడానికి కుట్రలు పన్నుతున్నారన్నారు. అందుకనే కశ్మీర్‌లో అధికరణ 370 రద్దు చేశారని, అలాగే మణిపూర్‌లో చిచ్చు పెట్టి.. ఇప్పుడు కర్రెగుట్టలో మొత్తం సైన్యాన్ని దించారని తెలిపారు. భవిష్యత్‌లో ప్రజా సంఘాల నేతలు, హక్కుల నేతలపై దాడి జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ధర్నాలో పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, సీపీఐ ఎంఎల్ ప్రజాపోరు నాయకులు దేవా, సీపీఎం నేత మణి, డీఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధర్మేంద్ర, విద్యా పరిరక్షణ కమిటీ ప్రతినిధి కిశోర్, అరుణోదయ నిర్మల, న్యాయవాదులు కె.ఎస్.చలం, సురేష్, ఎంఎస్ఎస్ఎస్ పూర్వ అధ్యక్షుడు కె.రవి, తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చల్లని నీడ

మండుటెండలో సేదతీరుస్తున్న భారీ వృక్షాలు


నూకాలమ్మ ఆలయం వద్ద మర్రి చెట్టు నీడలో సేద తీరుతున్న భక్తులు

ఎండల తీవ్రతతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు భీమిలిలో భారీ వృక్షాలు చల్లని నీడనిచ్చి, సేద తీరుస్తున్నారు. ఇక్కడ గ్రామ దేవత నూకాలమ్మ ఆలయం వద్ద ఉన్న విశాలమైన మర్రిచెట్టు ఎన్నో ఏళ్లుగా నీడనిస్తోంది. ఆలయానికి వచ్చే భక్తులతో పాటు పక్కనే ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చేవారు కూడా హాయిగా సేద తీరుతున్నారు. బీచ్‌రోడ్డులో లైట్‌హౌస్ ఎదురుగా ఉన్న పావురాల పార్కులోని భారీ రావిచెట్టు బీచ్‌కు వచ్చే సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. ఇక్కడికి వచ్చేవారు సేదతీరడంతో పాటు అల్పాహారం, భోజనాలు చేసి వెళ్తున్నారు. తగరపువలసలోని జమ్మిచెరువు పార్కు వద్ద అనేక చెట్లతో పాటు బెంచీలు కూడా ఉండటంతో చిన్న, పెద్ద హాయిగా విశ్రాంతి తీసుకుంటున్నారు.

– భీమునిపట్నం


పావురాల పార్కులో విశాలమైన రావి చెట్టు


జమ్మిచెరువు పార్కులో విస్తారంగా చెట్లు

శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు


సర్టిఫికెట్లు అందుకున్న మహిళలతో దివీస్ ప్రతినిధులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీకి అనుబంధంగా ఉన్న నైపుణ్య శిక్షణ కేంద్రంలో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 41 మంది మహిళలకు సర్టిఫికెట్లు, టూల్ కిట్లను సంస్థ జనరల్ మేనేజర్లు వైఎస్ కోటేశ్వరరావు, ఎం.ఎస్.ఎన్.రావు శుక్రవారం అందించారు. అలాగే ఉత్తమ ప్రతిభ కనపరచిన మహిళలకు బహుమతులు అందించారు. దివీస్ ప్రతినిధులు మాట్లాడుతూ మహిళలు ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకుని, పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలన్నారు. కార్యక్రమంలో చిప్పాడ, అమనాం, మూలకుద్దు, అన్నవరం పంచాయతీలకు చెందిన మహిళలతో పాటు సామాజిక సేవా బృంద ప్రతినిధులు డి.సురేష్‌కుమార్, ఎ.శ్రీనివాస్, పి.శేఖర్‌బాబు, కె.నరసింహారావు పాల్గొన్నారు.